www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 మే 2025



మున్సిపల్ మేనేజర్‌గా నాగేశ్వరరావు


మున్సిపల్ కమిషనర్‌కు బదిలీ పత్రం అందజేస్తున్న మేనేజర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్
భీమవరం పురపాలక సంఘం నూతన మేనేజర్‌గా ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న నాగేశ్వరరావు బదిలీపై భీమవరం వచ్చారు. నాగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డిని కలిసి విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ మినిస్ట్రీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాబత్తుల కృష్ణమోహన్, ఎఒ కొప్పినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంలో రైతు వద్ద ఉండిపోయిన ధాన్యం

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం యూ టర్న్..!

టార్గెట్ పూర్తయ్యిందని చేతులెత్తేసిన పౌర సరఫరాల శాఖ
ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ఖరీఫ్‌లో ముందుకు
రబీలో మాత్రం 60 శాతం ధాన్యం మాత్రమే టార్గెట్
సంచులు ఇవ్వకపోవడం, ట్రక్ షీట్ కొట్టకపోవడంతో రైతుల అవస్థలు
లారీల్లోకి ఎక్కించిన ధాన్యం సైతం నిలిచిపోయిన పరిస్థితి
ఉంగుటూరు మండలంతోపాటు పలుచోట్ల రోడ్డెక్కుతున్న రైతులు
జెసి ధాత్రిరెడ్డిని తప్పుదోవ పట్టిస్తున్న సివిల్ సప్లయీస్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం యూ టర్న్ తీసుకుంది. రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామంటూ ఖరీఫ్‌లో ముందుకు సాగిన ప్రభుత్వం, రబీలో మాత్రం అందుకు విరుద్ధంగా 60 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని భీష్మించుకుని కూర్చుంది. టార్గెట్లు పూర్తయిపోయాయంటూ పలు రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ ఉండవని చెప్పిన కూటమి సర్కార్ అరకొరగా ధాన్యం కొనుగోలు చేపట్టడంపై అధికార పార్టీకి చెందిన టిడిపి, జనసేన నాయకులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కుతున్నారు. ఏలూరు జిల్లాలో ధాన్యం ఎక్కువగా పండే ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మిగిలిన మండలాల్లోనూ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఆటంకాలు కన్పిస్తున్నాయి. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 80 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా 2.20 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాలశాఖ ప్రణాళికలు రూపొందించింది. అధికారులు ఇచ్చిన టార్గెట్ చాలా రైతుసేవా కేంద్రాల్లో పూర్తవ్వడంతో ధాన్యం కొనుగోలును నిలిపివేశారు. నిడమర్రు మండలం అడవికొలనులో లారీల్లోకి లోడ్ చేసిన ధాన్యం సైతం నిలిపివేసిన పరిస్థితి ఉంది. పెదనిండ్రకొలను గ్రామంలోనూ అదే పరిస్థితి. ఉంగుటూరు మండలం కాగుపాడు వంటి అనేక గ్రామాల్లో సంచుల్లో పట్టేసిన ధాన్యం సైతం కళ్లాల్లోనే ఉండిపోయింది. రాత్రిపూట వర్షం కురుస్తుండటంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతుల అవస్థలు వర్ణనాతీతం. ఉంగుటూరు మండలంలో లక్షా పది వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, 73 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కాగుపాడు, దొంతవరం, కాకర్లమూడి, వియాపురం, తల్లాపురం వంటి గ్రామాల్లో ఇంకా మాసూళ్లు చేయాల్సిన పంట సైతం ఉంది. మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మిగిలిన ధాన్యం రైతులు ఎవరికి అమ్ముకోవాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. వ్యాపారుల వద్దకు వెళ్తే 75 కిలోల బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.వంద, రూ.150 తగ్గించి అడుగుతున్నారు. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆది నుంచి జిల్లాలోని పౌర సరఫరాల శాఖాధికారులు సరిగా వ్యవహరించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని సైతం పౌర సరఫరాల శాఖాధికారులు తప్పుదోవ పట్టించారనే చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. దిగుబడి అంచనాలు తక్కువగా చూపించారంటూ వ్యవసాయ శాఖను బూచిగా చూపించే ప్రయత్నం పౌరసరఫరాల శాఖాధికారులు చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

మరో వారంలో 'పశ్చిమ'లోనూ అలజడి తప్పదు

పశ్చిమగోదావరి జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఆరు లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు మాత్రమే టార్గెట్ ఇచ్చారు. ఇప్పటి వరకూ 4.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ కొనుగోలు జరిగింది. కొన్ని రైతుసేవా కేంద్రాల్లో టార్గెట్ పూర్తయిపోగా, పక్కనే ఉన్న రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పశ్చిమలోనూ ధాన్యం టార్గెట్ పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత ధాన్యం కొనుగోలు నిలిపివేస్తే ఆ జిల్లాలోనూ రైతులు రోడ్డెక్కే పరిస్థితి రానుందని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటి వరకూ 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమవుతుండటంతో ప్రభుత్వంపై రైతుల్లో మంచి అభిప్రాయం నెలకొంది. ధాన్యం కొనుగోలు నిలిపివేస్తే మాత్రం ప్రభుత్వం రైతుల నుంచి తీవ్ర ఆగ్రహం చవిచూడక తప్పదని చెప్పొచ్చు.

టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనబోమంటున్నారు
బుక్కా రామకృష్ణ, కౌలురైతు, కాగుపాడు


'నాలుగెకరాల్లో వరిసాగు చేశాను. మాసూలు చేసి 15 రోజులైంది. 220 బస్తాల ధాన్యం ఉంది. రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్తే టార్గెట్ పూర్తయిపోయిందని, ధాన్యం కొనుగోలు చేయబోమని చెబుతున్నారు. గురువారం రాత్రి ఒంటిగంటకు వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోతుంటే కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డాం. ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యనే శరణ్యం.

సగం ధాన్యం కళ్లాలోనే ఉన్నాయి
వీరమల్ల జగన్నాథం, కౌలురైతు, కాగుపాడు

18 ఎకరాల్లో వరిసాగు చేశాను. సగం ధాన్యం విక్రయించాను. ఇంకా సగం ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. వర్షానికి తడిసిపోయే పరిస్థితి నెలకొంది. లారీలు రావడం లేదు. టార్గెట్ పూర్తయిందని కొనుగోలు చేయడం నిలిపివేశారు. ధాన్యం ఎవరికి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇదెక్కడి అన్యాయం

ఇళ్ల శిథిలాలు చూసి నివ్వెరపోయిన అఖిలపక్ష నేతలు
సమస్య పరిష్కారమయ్యేంత వరకు తోడుంటామని భరోసా
పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో అఖిలపక్ష బృందం పర్యటన
ఎంఎల్‌ఎకు ఆక్వా చెరువుల కలుషిత నీరు కన్పించడం లేదా అని ప్రశ్నించిన నేతలు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం
'ఇదెక్కడి అన్యాయం.. ఇంత దారుణమా.. పేదల ఇళ్లను కక్షగట్టి కూల్చినట్లుగా ఉంది. ఇది సరికాదు. తక్షణం బాధిత ప్రజలకు ఇళ్లు కట్టి ఇవ్వాలి' అని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలు, ప్రజాసంఘాల నేతలతో కూడిన అఖిలపక్ష బృందం శుక్రవారం పర్యటించింది. ఇళ్లు కూలగొట్టిన దృశ్యాలు, శిథిలాల మధ్య గడుపుతున్న నిర్వాసితులు, భూస్వాములు ఆక్రమించుకున్న భూమి, ఆక్వా చెరువుల వల్ల రాజు కాలువ కలుషితం వంటి దృశ్యాలను చూసి నేతలు నివ్వెరపోయారు. బాధిత ప్రజలు అఖిలపక్ష నేతల వద్ద తమ గోడు చెప్పుకున్నారు. రొయ్యల చెరువుల కలుషిత నీటిని రాజు కాలువలోకి మోటార్లతో బయటకు పంపిస్తూ కాలువను అన్నివిధాలా కలుషితం చేస్తుంటే డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుకు కనిపించట్లేదా అని అఖిలపక్ష నేతలు ప్రశ్నించారు. 'బాధితులెవ్వరూ అధైర్య పడొద్దు.. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ అండగా ఉంటాం' అని నేతలు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, సిపిఐ జిల్లా నాయకులు మల్లులు సీతారాం ప్రసాద్, బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు కోర్ర శ్రీనివాస యాదవ్, పుచ్చకాయల రత్నంరాజు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ మాట్లాడుతూ రాజు కాలువ కాలుష్యానికి కారకులను వదిలేసి అమాయక ప్రజల ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్నారు. నియోజకవర్గంలో కిందిస్థాయి కార్యకర్తలు చెప్పే మాటలు వాస్తవమా, కాదా అని ఆలోచించి ఉండి ఎంఎల్‌ఎ నిర్ణయాలు తీసుకోవటం మంచిదని హితవు పలికారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను తొలగించి పేదలను రోడ్డున పడేయడం దారుణమన్నారు. తక్షణం బాధిత ప్రజలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అఖిలపక్ష నేతల పర్యటన సమయంలోనే ఎగువ భాగాన ఉన్న రొయ్యల చెరువులో నీటిని మోటార్లతో రాజు కాల్వలోకి వదులుతుండటాన్ని బృందం గమనించి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో చెరువు యాజమాన్యం మోటార్లను ఆపి పక్కకెళ్లిపోవడం గమనార్హం. దీంతో రాజు కాల్వ కాలుష్యానికి ప్రధాన కారణం ఎవరనే నిజం తేటతెల్లమైందని నేతలు వ్యాఖ్యానించారు. బహిరంగంగా కాలువలోకి ఆక్వా చెరువుల నీటిని వదిలేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోరని డిప్యూటీ స్పీకర్‌ను అఖిలపక్షం ప్రశ్నించింది. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, పివి.ప్రతాప్, కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, ప్రజాసంఘాల నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, మామిడిశెట్టి రామాంజనేయులు, జుత్తిగ నరసింహమూర్తి, దూసి కళ్యాణి, ఎ.అజయకుమారి, ఆకుల హరేరాం, శేషపు అశ్రియ్య, గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

బస్సుల్లేక జనం అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం
అమరావతిలో ప్రధాని సభకు ఆర్‌టిసి బస్సులను మళ్లించడంతో రోజువారీ సర్వీసులు లేక జనం నానావస్థలు పడ్డారు. సభకు నరసాపురం డిపో నుంచి 30 బస్సులు వెళ్లాయని ఆర్‌టిసి అధికారులు తెలిపారు. దీంతో పలు రెగ్యులర్ సర్వీసులను రద్దు చేశారు. దీంతో శుక్రవారం నరసాపురం బస్టాండ్ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు బస్సులు లేక ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు.

పాలకొల్లు: ఆర్‌టిసి బస్సులు లేక బస్టాండ్లలో ప్రయాణికులు పడిగాపులు పడ్డారు. అమరావతి వెళ్లేందుకు స్కూల్, ప్రయివేటు బస్సులతోపాటు ఆర్‌టిసి బస్సులను కూడా కూటమి నేతలు నియోజకవర్గాల్లో తీసుకోవడంతో కొన్ని బస్సులు మాత్రమే రెగ్యులర్ సర్వీసులుగా తిరిగాయి. దీంతో జనం నానావస్థలు పడ్డారు.


పాలకొల్లు బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

ధాన్యం క్వింటాకు రూ.3 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అమలు చేయాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం
ప్రజానీకానికి తాగునీటి కొరత లేకుండా చూడాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం
ధాన్యం క్వింటాకు రూ.3 వేలు చెల్లించాలని, కేంద్రం ధరకు రాష్ట్రం బోనస్ కలిపి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. దుర్గాపురంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథి బలరాం మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ధాన్యం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ తరుణంలో వాతావరణం బాగోలేకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళన పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో గోనె సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజురోజుకీ వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతాంగం ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లాలో ఆక్వా రైతులు కూడా అధికంగా ఉన్నారని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల వల్ల ఆక్వా రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రతి కౌంట్‌కూ ప్రభుత్వం రూ.40 నుంచి రూ.50 వరకు అదనంగా చెల్లించి కొనాలన్నారు. ఫీడ్ ధర తగ్గించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన విద్యుత్ రాయితీ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సాగు తగ్గిపోవడంతో వ్యవసాయ కూలీలు ఉపాధి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రస్తుత వేసవి దృష్ట్యా జిల్లా ప్రజానీకానికి తాగునీటి కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ప్రతి దళితపేటకూ రెండెకరాల శ్మశాన వాటికను కేటాయించాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలు లేక రోడ్ల పక్కన, కాలువల పక్కన, నదుల పక్కన దళితులు ఖననం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా జిఒలు, సర్క్యులర్లు జారీ చేసి వదిలేస్తున్నారు తప్ప దళితులకు శ్మశానవాటికలను కేటాయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో నేటికీ ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు లక్షల్లో ఉన్నారని, ఎన్నికల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కమిటీ సభ్యులు దూసి కళ్యాణి, పుగాకు పూర్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

న్యాయవాదులకిచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - తణుకు
న్యాయవాదులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోర్టు ఆవరణలో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం ద్వారా ప్రతినెలా రూ.5 వేలు శిక్షణ భృతిగా ఇస్తామని చెప్పినా పెండింగ్‌లోనే ఉందన్నారు. దీనివల్ల న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. న్యాయవాదులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రూ.వంద కోట్లు కార్పస్ ఫండ్, వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.15 లక్షలు మంజూరు చేయాలని మునిస్వామి డిమాండ్ చేశారు. న్యాయమూర్తులు, కోర్టు ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని కోరారు. న్యాయవాదులకు ఇళ్ళ స్థలాలను కేటాయించి నిర్మాణానికి నిధులు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లిపూడి సువర్ణరాజు, అనుకుల రమేష్, కౌరు వెంకటేశ్వర్లు, ఉడతల పూలేశ్వరరావు, పి.ప్రభాకర్‌రావు, పి.శ్రీనివాసరావు, కె.గంగాభవాని, దొమ్మేటి సూర్యనారాయణ, పిట్టా శామ్యూల్ పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న న్యాయవాదులు

4.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రూ.914.510 కోట్లు ధాన్యం సొమ్ము జమ - జిల్లా పౌర సరఫరాల మేనేజర్ టి.శివరామ ప్రసాద్

ప్రజాశక్తి - యలమంచిలి
ఇప్పటి వరకు పశ్చిమగోదావరి జిల్లాలో 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 44,607 మంది రైతుల వద్ద నుండి రూ.967.19 కోట్లు విలువైన 4,19,595 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ టి.శివరామప్రసాద్ తెలిపారు. మండలంలోని గుంపర్రు, మేడపాడు తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను డిఎం శుక్రవారం పర్యవేక్షించారు. రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ రూ.914.51 కోట్లు ధాన్యం నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. శుక్రవారం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.52.68 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఆయన వెంట యలమంచిలి ఎఒ సిహెచ్.దేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,43,05,497 గోనె సంచులను రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయగా, 1,04,89,875 గోనె సంచులను ధాన్యం కొనుగోలుకు వినియోగించినట్లు వివరించారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ శివరామప్రసాద్

చినవెంకన్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల
ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) వైశాఖమాస తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను దేవాలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకర్‌రావు, నివృతరావు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానికంగా ఛైర్మన్ అతిథిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబూరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నటరాజు పాల్గొన్నారు. ఈ నెల ఏడో తేదీ నుండి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా కళ్యాణోత్సవాలు జరుగుతాయని తెలిపారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రావు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొవ్వలి

అన్న స్మార్ట్ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం
పట్టణంలోని రుస్తుంబాదకు చెందిన మునగాల సుబ్బరాజు సౌజన్యంతో బస్ కాంప్లెక్స్ ఎదురుగా అన్న స్మార్ట్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, కొవ్వలి అనుచరులు పాల్గొన్నారు.

3,4,5 తేదీల్లో సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - భీమవరం
2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 3, 4, 5వ తేదీల్లో ఇంటర్మీడియట్ బోర్డు అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 12వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల పరీక్ష ఫీజు గడువు ఏప్రిల్ 25వ తేదీతో ముగిసిందని, విద్యార్థుల శ్రేయస్సు కోసం ఫీజు చెల్లించని విద్యార్థులకు ఇంటర్ విద్యామండలి చివరి అవకాశం కల్పించిందని, విద్యార్థులు తాము చదువుతున్న కళాశాలలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఈ తేదీల తరువాత పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఎటువంటి అవకాశం ఉండదని, పరీక్ష ఫీజు చెల్లించాలనుకున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కాశ్మీర్ ఉగ్రదాడి దేశ సార్వభౌమత్వంపై దాడి

కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెబిఆర్.నాయుడు

ప్రజాశక్తి - భీమవరం
పహాల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిగా భావించాలని కాంగ్రెస్ పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెబిఆర్.నాయుడు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెబిఆర్.నాయుడు మాట్లాడుతూ పహాల్గామ్ దాడి జరిగిన వెంటనే అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించిన తొలి నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ పరిపక్వత లేకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడాన్ని ఖండించారు. పాకిస్తాన్‌పై మూడు యుద్ధాల్లో విజయం సాధించింది కాంగ్రెస్ హయాంలోనే అని గుర్తు చేశారు. సమావేశంలో భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం, జిల్లా ఎస్‌సి సెల్ ఛైర్మన్ కాకర రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో శనివారం వరదరాజపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గణపవరం, జల్లికొమ్మర, వరదరాజపురం, కొత్తపల్లి, వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం, మొగ్గళ్ల, అర్ధవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తాడేపల్లిగూడెం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

4న గురుకులంలో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 4న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు లక్ష్మణేశ్వరం బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ సిహెచ్ కె.శైలజ తెలిపారు. లక్ష్మణేశ్వరంలోని నక్కావారిపేటలో బిసి గురుకుల పాఠశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించారన్నారు. గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో సీట్ల భర్తీ కోసం ఈ నెల 4న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వైట్‌పేట్ హాల్ టికెట్‌తోపాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను ఆధార్ కాపీ, రైటింగ్ ప్యాడ్ స్టైల్ ఒంటి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకుని గంట ముందు పరీక్షకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

5 నుంచి దశలవారీ ఉద్యమం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాఠశాలల్లో ప్రభుత్వం, విద్యాశాఖ చేపడుతున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా మే 5 నుంచి దశల వారీగా ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పిఎస్‌వి.ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.రాంబాబు, జిల్లా కార్యదర్శి, సిహెచ్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చూస్తోందన్నారు. తక్షణం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మే 5న పాత తాలూకా కేంద్రాల్లోనూ, 9న జిల్లా కేంద్రాల్లోనూ, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాలు చేపట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం నిర్ణయించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు


ప్రదర్శన చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం నూకరాజు తెలిపారు. మొగల్తూరులోని పెద్దపల్ల పాలెం రైతు సేవా కేంద్రం వద్ద కెపిసి 2025-2026 గాను కార్యాచరణ ప్రణాళిక గురించి రైతులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం నూకరాజు హాజరయ్యారు. జిల్లా కోఆర్డినేటర్ ఎం.అరుణ కుమారి ప్రకృతి వ్యవసాయం గురించి, రైతుల సమస్యల గురించి మాట్లాడారు. అనంతరం డిపిఎం నూకరాజు మాట్లాడారు. రసాయనిక, పురుగు మందులు వాడి వ్యవసాయం చేయడం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. వాతావరణం వల్ల పెరుగుతోందని, వాతావరణం కాలుష్యం అవుతుందని తెలిపారు. గాల్లో కార్బన్ డయాక్సైడ్ పెరగడం వల్ల భూతాపం పెరుగుతోందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఎ గ్రేడ్ మోడల్ ఫిష్ ప్లస్ కిచెన్ గార్డెన్ గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. అలాగే రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి ఎ.నరసింగరావు, మండల ఇన్‌ఛార్జి ఎల్లి కుమారి, సిబ్బంది, చిన్న సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగవు

అత్తిలి: కార్మికుల ఐక్యతను చాటే మేడే అత్తిలి మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ప్రజా సంఘాల కార్యాలయం నుంచి మార్కెట్ మీదుగా బస్టాండ్ వరకూ ర్యాలీ కార్మికుల ఆధ్వర్యంలో జరిగింది. కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ అనేక పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక సంక్షోభాలు వెలువడుతున్న వేళ కార్మికులపై, ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ ఈ నెల 20న జరగబోయే సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్, ఇ.శీను, దాసం కృష్ణ, గాజుల గణేష్, వై.సుబ్బారావు, మల్లెపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాఘవేంద్రరావుకు శుభాకాంక్షలు

భీమవరం టౌన్: దర్శకేంద్రులు కె.రాఘవేంద్రరావు చిత్రసీమలో అడుగుపెట్టి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్‌లో శుభాకాంక్షలు తెలుపుతూ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాఘవేంద్రరావుకు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా థియేటర్ మేనేజర్ గన్నాబత్తుల శ్రీనివాస్, మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ మాట్లాడారు. రాఘవేంద్రరావు దర్శకత్వ ప్రస్థానానికి 50 ఏళ్లు పూర్తి కావడం గొప్ప విశేషమని తెలిపారు. కార్యక్రమంలో కారుమూరి భాస్కరరావు, మడిపల్లి శేఖర్, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రసాద్, పెదపాటి రాజబాబు, పులపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిన కూటమి నేతలు

పెనుమంట్ర: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అమరావతిలో జరిగే ప్రధాని మోడీ సభకు తరలివెళ్లారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పిలుపు మేరకు సభకు వెళ్తున్నట్టు వారు తెలిపారు.

భీమవరం టౌన్ : భీమవరం నియోజవర్గం నుంచి జనసేన, బిజెపి, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

ఆచంట : మోడీ శంకుస్థాపన కార్యక్రమానికి మండలం నుంచి భారీ స్థాయిలో కూటమి నేతలు తరలివెళ్లారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, కరుగోరుమిల్లి, కోడేరు, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం నుంచి సుమారు 450 మంది వరకూ ప్రయివేటు స్కూల్ బస్సుల్లో తరలి వెళ్లారు. సభకు వెళ్లే వారికోసం వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆహార పొట్లాలు, తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు తరలించారు. వెళ్లిన వారిలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, కూటమి నేతలు ఉన్నారు.

తాడేపల్లిగూడెం : అమరావతిలో రాజధాని పున్ణప్రారంభ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం నుంచి పెద్ద ఎత్తున బస్సులతో ర్యాలీగా వెళ్తున్న కూటమి నేతలకు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ఎంఎల్ఎ ర్యాలీగా బయలుదేరారు.

ఆకివీడు : ప్రధాని సభకు మండలం నుండి పది బస్సుల్లో కూటమి నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆకివీడు చిండి ఐదు లారీలు ప్రత్యేకంగా వెళ్లాయి. బస్సులను ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు.

ఉండి : అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి ఉండి నుండి ఐదు బస్సులు కేటాయించినట్లు వెలుగు ఎపిఎం రాజేష్ తెలిపారు. యండగండి, కోలమూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉండి, చెరుకువాడ గ్రామాలు, పరిసర ప్రాంతాల నుండి ప్రజలను తరలించేందుకు ఐదు బస్సులు కేటాయించగా ఆ బస్సుల్లో అమరావతి వెళ్లేందుకు అనాసక్తితో ఉండడంతో డ్వాక్రా మహిళలను అధికారులు తరలించారు.

మొగల్తూరు : అమరావతిలోని మోడీ సమావేశానికి మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో 5 వాహనాల్లో కూటమి నేతలు వెళ్లారు. ఆయా వాహనాలను ఎంఎల్ఎ నాయకర్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు జెండా ఊపి ప్రారంభించారు.

పాలకొల్లు : అమరావతి రాజధాని పున:ప్రారంభ సభకు పాలకొల్లు నియోజకవర్గం నుంచి 3 వేల మంది తరలివెళ్లారు. మంత్రి రామానాయుడు ప్రత్యేక బస్సులు, కార్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా మధ్యాహ్నం, రాత్రికి బిర్యానీ పొట్లాలు, సాంబార్ అన్నం, పెరుగన్నం, అరటిపళ్లు, మజ్జిగ, స్వీట్లు, ఫ్రూట్స్, మంచినీళ్ల బాటిల్స్ ఇలా అన్ని రకాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

వాసవీ క్లబ్ సేవలు ఎనలేనివి

నరసాపురం: నరసాపురం వాసవీ క్లబ్ తరపున మూడో చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ రిజినల్ ఛైర్మన్ వంకాయల శ్యామల స్థానిక స్టీమర్ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం క్లబ్ వారు చేస్తున్న సేవాతత్పరత ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జీ, జోన్ ఛైర్మన్ ఎ.బదరి, ఎం.రాజా, దేవత సుబ్బారావు పాల్గొన్నారు.

కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత

ప్రజాశక్తి - గణపవరం

కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత అని ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం గణపవరం 7వ అంగన్వాడీ కేంద్రం వద్ద కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమం మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణా కార్యక్రమం ప్రతి మంగళవారం శుక్రవారం జరుగుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త పార్వతి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : బాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి తల్లిదండ్రులకు సూచించారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదతాడేపల్లి సచివాలయం వద్ద యుక్త వయసు బాలికల సమావేశం నిర్వహించారు. బాలికలకు ఆహారంలో కోడిగుడ్లు, పాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

పాలకోడేరు : బాలికల సాధికారత అందరి బాధ్యత అని ఐసిడిస్ పీడీ బి.సుజాతారాణి అన్నారు. విస్సాకోడేరులో కిశోరి వికాసం కార్యక్రమాన్ని సర్పంచి బొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ సుజాతారాణి బాలికలకు సూచనలిచ్చారు. బాలికలు చిన్ననాటి నుంచే దృఢంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ బాలికలు చదువుతోపాటు చట్టాలపై అవగాహన చేసుకుని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం కిశోర బాలికల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. టిడిపి నాయకులు నడిపూడి అప్పారావు, జనసేన నాయకులు గాదం నానాజీ, సూపర్‌వైజర్ సూర్యకుమారి, మహిళా పోలీస్ ప్రసన్న, ఎఎన్ఎం హిమమ కుమారి, విఒఎ హైమావతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.


పాలకోడేరు :పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

యలమంచిలి : కిశోరి వికాస్ కార్యక్రమాన్ని మేడపాడులో ఎంపిటిసి దేగల సూర్యప్రభ, ఆర్యపేట గ్రామ సర్పంచి మేడిది జ్ఞానమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా మాట్లాడుతూ 11 నుంచి 15 సంవత్సరాలు ఉన్న కిశోర బాలికలకు సమ్మర్ స్పెషల్ క్యాంపు, ట్రెయినింగ్ క్లాసు నిర్వహించి పోషణ అవసరాలు, బాలికల సమస్యలు, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్స్ తదితర వాటి గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మీ నరసమ్మ, ఆశా వర్కర్ నర్సమ్మ, అంగన్వాడీ టీచర్స్ శాంతి కుమారి, అనూష పాల్గొన్నారు.

వీరవాసరం : కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమం పై వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బందికి సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన అవగాహన కల్పించారు. జూన్ 10వ తేదీ వరకూ నిర్వహించే కార్యక్రమంలో కిశోర బాలికులకు వివిధ చట్టాలపై, లైంగిక విద్య, పోక్సో చట్టం, లింగవివక్ష, సైబర్ నేరాలు వంటి అనేక విషయాలపై అవగాహన కల్గించనున్నట్టు సూపర్‌వైజర్ సరోజిని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. గురువారం స్థానిక శివాలయం వీధి సత్యసాయి సేవా మందిరంలో కిశోరి వికాసం కార్యక్రమంపై సమీక్షించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల్లో చైతన్యం తీసుకురావడానికి కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సమాజంలో కిశోర బాలికలు పలు రకాలుగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.సుజాత, విలేజ్ కమిటీ సభ్యులు ఎంఎస్ కె.ఉమామహేశ్వరి, అంగన్వాడీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, విద్య ఆవశ్యకతను గ్రహించి పిల్లలకు బోధించాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కిశోరి వికాసం కార్యక్రమం ప్రారంభ సందర్భంగా స్థానిక రెండో సచివాలయం పరిధిలో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఛైర్‌పర్సన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ వాణి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశాలు, కిశోర బాలికలు, మహిళా పోలీసులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : దగ్గులూరు, కాపవరం గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమం ఐసిడిఎస్ అధికారిని సిహెచ్.ఇందిర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఫోక్స్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మమతాశ్రీ, సర్పంచులు విశ్వనాథం వీరభద్రం, కోలాటి రాధ పాల్గొన్నారు.

పెనుమంట్ర : కిశోర బాలికలు సామాజిక, శారీరక అంశాలపై అవగాహన పెంచుకోవాలని పెనుమంట్ర గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పెనుమంట్ర గ్రామ సచివాలయంలో కిశోర బాలికల వేసవి శిక్షణా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.

అంగన్వాడీ పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిని దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌సి బోస్ మాజీ సైనిక్ కాలనీ గ్రామ సర్పంచి మంతెన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎస్‌సి బోస్ మాజీ సైనిక్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. అంగన్వాడీ టీచర్లు రాణి, భాగ్యలక్ష్మి, హేమారాణి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. మాలవానితిప్పలో అంగన్వాడీ సెంటర్‌లో కిశోర బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వేగేశ్న పద్మావతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - నరసాపురం

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నరసాపురం సిపిఎం కార్యాలయం మీటింగ్ హాల్లో క్రాంతి ఆటో యూనియన్ ఓనర్ అండ్ డ్రైవర్స్ ప్రెసిడెంట్ యస్ స్టాన్లీ కుమార్ ఆధ్వర్యంలో కార్మిక చట్టం, అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయ సేవలు అంశంపై న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు, న్యాయవాదులు చల్లా దానయ్యానాయుడు, వై.దేవేంద్ర ఫణీకర్ పాల్గొని మాట్లాడుతూ అందరూ కార్మిక చట్టం, బాల కార్మిక చట్టంపై అవగాహన కలిగిఉండాలన్నారు. డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. జులై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసాపురం టౌన్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌విలు ఎం.విజయకుమార్, బొడ్డు కృష్ణ భగవాన్, నల్లి ప్రతిభారాజీ, బి.శ్యామ్ కుమార్, ఆటో యూనియన్ మెంబర్లు పాల్గొన్నారు.

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

వేసవి నేపథ్యంలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లూరు, ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, రూట్ మ్యాప్‌లు, కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగ్ పనులను, ఫార్మసీ తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎండల తీవ్రత క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి కొరత, జల కాలుష్యంతో డయేరియా, వడదెబ్బ ఇతర సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సెలైన్ బాటిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చెమట అధికంగా పట్టి అస్వస్థతకు గురయ్యే లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ పూజ, డాక్టర్ వేణుబాబు, డాక్టర్ హైందవి, ఎంపిహెచ్ఇఒ శివకుమార్, హెచ్‌వి.వసంతకుమారి పాల్గొన్నారు.

సొసైటీ సభ్యుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం సిటిజన్ కోపరేటివ్ సొసైటీ సభ్యుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని సంస్థ ఛైర్మన్ రంగరాజు, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్రకుమార్ వివరించారు. శుక్రవారం స్థానిక ఉష్ణోగ్రాండ్ హాల్లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో తాడేపల్లిగూడెం బ్రాంచి సుమారు 15 శాతం వృద్ధి సాధించిదని, రాబోయే సంవత్సరంలో మరింతగా లాభాలు పెంచు కుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ వినోద్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వాడకంలో పరిశీలన అవసరం

మార్టేరు పరిశోధనా స్థానం సంచాలకులు సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరి, మొక్కజొన్న వంటి పంటల్లో ఎరువుల వినియోగం సూచనల కంటే చాలా ఎక్కువగా ఉంటోందని, దీనివల్ల రానున్న రోజుల్లో భూసారం తగ్గిపోతుందని, ఎరువుల మోతాదును పున్ణపరిశీలించాల్సిన ఆవశ్యకత పంటల యాజమాన్యం, శాస్త్రవేత్తలపై ఉందని ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరు ఫారంలో జరిగిన గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి రెండో రోజు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి ప్రధానంగా ఉన్న ప్రాంతాల్లో కోత తరువాత మిగిలిన దుబ్బులను తగలబెడుతున్నారని, సులభంగా కుళ్లిపోయి భూమిలో కలిసిపోయేలా చేయడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాలను గోదావరి మండలంలో పరిశీలించాలని ఆదేశించారు. మొక్కజొన్నకు అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తున్న దృష్ట్యా, మార్కెట్‌లో ఉన్న అన్ని సంకర రకాలతో పాటు పెద్దాపురం పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వంగడాలు కూడా రసాయన ఎరువుల అవసరత కోసం పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. విస్తరణ సంచాలకులు జి.శివనారాయణ మాట్లాడుతూ గోదావరి మండలంలో సాగుచేస్తున్న పంటలకు విలువ జోడింపు చేసి తద్వారా అధిక ఆదాయం సాధించేలా రైతులను సమయాత్త పరచాలని కోరారు. శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వరి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు బివి.కృష్ణారావు మాట్లాడారు. అనంతరం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు ఐదు బృందాలుగా ఏర్పడి వరి, అపరాలు, చెరకు, చిరుధాన్యాలు, యాంత్రీకరణలో సంవత్సరానికి చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ ప్రణాళికను రూపొందించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉదయ భాస్కరరావుకు దాసరి సేవారత్న అవార్డు

యలమంచిలి: ఎపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత కొంతేరు గ్రామానికి చెందిన గుమ్ములూరు ఉదయ భాస్కరరావు దాసరి సేవా రత్న అవార్డు అందుకున్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన దాసరి ఫిల్మ్ అవార్డు సభలో సినీనటులు మురళీమోహన్, హీరో సుమన్, సాయి కుమార్, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అవార్డు అందజేశారు. ఉదయ భాస్కరరావుకు అవార్డు రావడం పలువురు అభినందించారు.